RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 123 | ఏప్రిల్ 6, 2025 | వెల : రూ.3-00

**మంత్రి వర్గ విస్తరణ మరింత ఆలస్యం?**
2లో..



ఘనంగా బాబూ జగ్జీవన్ రాం

## జయంతి వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ :**

షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ వరంగల్ జిల్లా ఆధ్వర్యం లో ఎల్ బి కళాశాల లోని జయ సేన మెమోరియల్ ఆడిటోరియం లో శనివారం నిర్వహించిన డా.బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి కొండ సురేఖ హాజరై ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, డి ఆర్ డి ఓ కౌసల్య, జడ్పి సిఈఓ రామ్ రెడ్డి, జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి భాగ్య లక్ష్మీ,వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**పొలాల గెట్లు తొలగించొద్దు..**

**జాబ్ మేళా పోస్టర్ విడుదల చేసిన మంత్రి సురేఖ**

**ఆకుల మానసకి సన్మానం**

వివరాలు 3లో..

- కంప్లయింట్స్‌పై చర్యల్లో జాప్యం
- క్వాలిటీ ట్రీట్‌మెంట్ అందడం లేదంటూ బాధితుల ఫిర్యాదులు
- చర్యలు తీసుకోవడంలో వెనుకబడిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్




# టీజీఎంసీ.. స్లో యాక్షన్..?

**వేద న్యూస్, హైదరాబాద్ :**

నాణ్యమైన వైద్యం అందడం లేదంటూ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులపై టీజీఎంసీ(తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్)కి ఫిర్యాదు చేయగా, యాక్షన్ తీసుకోవడం కౌన్సిల్ తీవ్రజాప్యం చేస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. కంప్లయింట్స్ ఆధారంగా మెడికల్ కౌన్సిల్ సభ్యులు సదరు డాక్టర్లతో సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదులను మెడికల్ కౌన్సిల్ సకాలంలో పరిష్కరించకపోవడంతో నకిలీ వైద్యులు, నాణ్యమైన వైద్య సేవలందించని పలు ఆసుపత్రులవాళ్లు మరింతగా రెచ్చిపోతూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తప్పులు చేసినా శిక్షలు పడవనే ధీమా వాళ్లలో ఎక్కువైపోతున్నది. మరోవైపు వైద్యం పేరుతో అధిక ఫీజులు అడ్డగోలుగా వసూలు చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. రకరకాల ఫీజుల పేరిట సరికొత్తగా సామాన్యులపై భారం మోపుతున్నారు. సామాన్యుడికి అందని ద్రాక్షగానే వైద్యాన్ని మార్చేందుకు రకరకాల కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఒకవైపు నిర్లక్ష్యపు వైద్యం, మరోవైపు చర్యలు తీసుకోలేని మెడికల్ కౌన్సిల్ తీరు పట్ల బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### గతేడాది 31 కేసులు నమోదు..?

పెండింగ్ కేసులను పరిష్కరించడంలో టీజీఎంసీ వెనకబడిందనే చెప్పొచ్చు. 2019 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా నాణ్యమైన వైద్యం అందించలేదని పలువురు వైద్యులపై 95 కేసులు నమోదయ్యాయి. గతేడాది 31 కేసులు కేవలం బాధితుల నుంచే వచ్చాయని సమాచారం. కాగా వైద్యపరమైన నిర్లక్ష్యం, అక్రమ వైద్యం,

మిగతా 4వ పేజీలో..



**వైభవంగా స్వామి వారి కల్యాణం**

**వేద న్యూస్, చిల్పూర్ :**

జనగాం జిల్లా శ్రీశ్రీశ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీ స్వామి వారి కల్యాణము వేదమంత్రోచరణలతో అర్చకులు వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి పట్టణాల నుంచి అధిక భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శ్రీమన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమం ఆలయ ఈవో బి.లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కె.మోహన్, ముఖ్య అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ దేశానికే ఆదర్శం

- చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే పథకం
- పేద ప్రజల పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం దేశానికి ఆదర్శమని అటవీ,పర్యావరణ,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్ లో రేషన్ దుకాణాలను లబ్ధిదారులకు సన్న బియ్యం అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ప్రారంభించిన సన్నబియ్యం కార్యక్రమం ఎంతో విజయవంతం అయిందని లబ్ధిదారులు కూడా దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల దళారీ వ్యవస్థ ఏర్పడి రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారిని నేడు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంతో ప్రతి లబ్ధిదారుడు సన్నబియాన్నే వినియోగించుకుంటూ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసినట్లు అయిందని మంత్రి సురేఖ తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మదిలో చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని సంక్షేమ పథకాలతో అప్పుల రాష్ట్రాన్ని అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నారని తెలిపారు.



## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి..!

**ప్రజా ధర్నా పోస్టర్ ఆవిష్కరించిన డెమోక్రసీ నాయకులు**

**వేద న్యూస్, హన్మకొండ :**

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఉదయం 11 గంటలకు జరుగు ప్రజా ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు శనివారం హనుమకొండ కాళోజి సెంటర్ లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యంలో ఆదివాసి ప్రజలపై కేంద్ర రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజలు జల్ జంగిల్ జమీన్ ఇజ్జత్ అమరా హై అంటూ..అడవిని అడవిలోని సహజ సంపద, ఖనిజ సంపద వనరులను కాపాడుకునేందుకు పోరాడుతున్న ఆదివాసీ సంఘాలను నిషేధించి ఆ సంఘ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారని వారు ఆరోపించారు. ఆదివాసి గిరిజన ప్రజల హక్కుల రక్షణ కోసం రాజ్యాంగంలోని ఐదు ఆరు షెడ్యూల్లో ఉన్న చట్టాలను మోడీ అమిత్ షా ల ప్రభుత్వం కాలరాస్తూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నదనీ విమర్శించారు. ప్రత్యేకించి చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఆదివాసుల మీద పెద్ద ఎత్తున అణచివేత,నిర్బంధము, జాతిహననాన్ని కొనసాగిస్తున్నదని అంటూ ఇది సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలకు ,దళారీ నిరంకుశ కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టబెట్టేందుకైనని అన్నారు. గత ఏడాది జనవరి నెల ప్రారంభం నుండి నేటి వరకు 400లకు పైగా మంది ఆదివాసులను అలాగే మావోయిస్టు పార్టీ నాయకులను కార్యకర్తలను ఎన్కౌంటర్ ల పేరుతో చంపేస్తున్నాయని వారు విమర్శించారు.

ఈ మరణకాండ కు వ్యతిరేకంగా జరిగే ధర్నాకు వివిధ వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, ఐఎఫ్ టియు నగర కార్యదర్శి బన్న నర్సింగం, అనిల్, రాజేష్, శ్రీను, మురళి తదితరులు పాల్గొన్నారు.

## భారీ లొంగుబాటు

**పోలీసులకు లొంగిపోయిన 86 మంది మావోయిస్టులు**




**వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం :**

కాలం చెల్లిన సిద్ధాంతాలను వదిలి జనజీవన స్రవంతిలో కలవాలనే పిలుపునకు తోడు, మావోయిస్టు అగ్ర నాయకుల వేధింపులు, వసూళ్లకు తట్టుకోలేక 86 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఐజీ పి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గత నెలలో 64 మంది మావోయిస్టులు లొంగిపోగా ఇప్పుడు ఏకంగా 86 మంది లొంగిపోయారు. దీంతో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. వీరంతా మల్టీజోన్-1 ఐజీ పి.చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో లొంగిపోయారు. నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు భారీ సంఖ్యలో సరెండర్లు జరిగాయని ఐజీ తెలిపారు. లొంగిపోయిన వారిలో ఏసీఎం సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 5లక్షలు, పార్టీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.లక్ష, మిగతా సభ్యులకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పునరావాసంతో పాటు అన్ని ప్రోత్సాహకాలు అందేలా చూస్తామని వెల్లడించారు. మావోయిస్టుల లొంగుబాటులో కీలక పాత్ర పోషించిన కొత్తగూడెం, సీఆర్‌పీఎఫ్ పోలీసుల చొరవ అమోఘం అని అన్నారు.

# 8.7 లక్షల కోట్ల ఆస్తులతో వక్ఫ్ బోర్డు




న్యూఢిల్లీ : భారత్ లో అతి ఎక్కువ భూమి ఎవరి అధీనంలో ఉందో తెలుసా..? భారతీయ రైల్వే బోర్డు వద్ద..ఆ తర్వాతి స్థానం సాయుధ దళాలది.ఇక మూడో అతి పెద్ద భూస్వామిగా వక్ఫ్ బోర్డ్ ఉంది.వక్ఫ్ బోర్డ్ వద్ద మొత్తం 8.7 లక్షల స్థిర, చరాస్తులు ఉన్నాయి. వీటిలో 9.4 లక్షల ఎకరాల భూమి ఉంది. దీని మొత్తం విలువ రూ.1.2 లక్షల కోట్లు. అంత భారీ ఆస్తులున్న వక్ఫ్ బోర్డ్ విషయంలో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ చట్టానికి సవరణ తీసుకొస్తోంది. ఈ సవరణ విషయంలో ఇప్పుడు వివాదం నెలకొంది. సవరణ బిల్లు పార్లమెంట్ లో పాసవ్వడంతో వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు వస్తాయి.ప్రస్తుతం అమలులో ఉన్న వక్ఫ్ చట్టాన్ని 1995లో రూపొందించారు. ఆ తర్వాత ఇప్పుడు సవరణ చేపట్టారు. వక్ఫ్ సవరణ బిల్లు -2024 పార్లమెంట్ ముందుకొచ్చింది. సవరణ బిల్లు పాసయితే ముస్లిం సమాజానికి నష్టం జరుగుతుందని ఆయా సంఘాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ప్రతిపక్షాలు కూడా ఈ బిల్లుని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అసలు 1995 వక్ఫ్ చట్టంలో ఏముంది..ఇస్లాం సంప్రదాయం ప్రకారం ముస్లిం సమాజ ప్రయోజనం కోసం చేసే దానాన్ని, ఇచ్చే విరాళాన్ని వక్ఫ్ గా పరిగణిస్తారు. వక్ఫ్ ఆస్తులు భగవంతుడికి చెందుతాయని వారు నమ్ముతారు. ఢిల్లీ సుల్తానులనుంచి వక్ఫ్ సంప్రదాయం మొదలైంది. ఆ తర్వాత దాన్ని కొనసాగిస్తున్నారు. వక్ఫ్ భూముల్ని.. మసీదులు, మదర్సాలు, షాదీమంజిల్ లు, అనాథ ఆశ్రమాలు, శ్మశాన వాటికలకోసం వినియోగిస్తున్నారు. అయితే వక్ఫ్ ఆస్తులు చాలా వరకు అన్యాక్రాంతం అయ్యాయనేది ప్రధాన ఆరోపణ. వక్ఫ్ బోర్డ్ సమర్థంగా వాటిని నిర్వహించలేకపోవడం వల్లే అవి అన్యాక్రాంతం అయ్యాయని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సచార్ కమిటీ వేసింది. ఆ కమిటీ నివేదిక ప్రకారం సుమారు 58,889 వక్ఫ్ స్థలాలు ప్రస్తుతం అన్యాక్రాంతంలో ఉన్నాయి. 13వేల ఆస్తులపై కోర్టు కేసులున్నాయి. ఇక 4.35 లక్షల ఆస్తుల గురించి తగిన సమాచారమే లేదు. సో.. ఇంత నష్టం జరుగుతున్నా చూస్తూ ఊరుకోవాలా అనేది ఎన్డీఏ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్న. వక్ఫ్ ఆస్తుల్ని పరిరక్షించేందుకు కొత్త చట్టం పనికొస్తుందని అంటున్నారు నేతలుప్రస్తుతం దేశవ్యాప్తంగా 30 వక్ఫ్ బోర్డ్ లు ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లోని బోర్డులు వక్ఫ్ ఆస్తులని నిర్వహిస్తుంటాయి. అయితే కొత్త చట్టం అమలులోకి వస్తే బోర్డు సభ్యుల నియామకంలో ప్రభుత్వ పాత్ర గణనీయంగా పెరుగుతుంది. ఇప్పటి వరకు సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సభ్యులందరూ ముస్లింలు ఉండేవారు. ఇకపై ఇద్దరు ముస్లిమేతరులకు సభ్యత్వం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సభ్యుల్లో ఇద్దరు ముస్లిం మహిళలు కూడా ఉండాలని ప్రభుత్వం బిల్లులో ప్రతిపాదించింది. ఈ సవరణలను ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.వక్ఫ్ వివాదాలపై ఇప్పటి వరకు వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పు అంతిమం. కానీ ఇకపై ఆ ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జితో పాటు రాష్ట్ర ప్రభుత్వం నియమించే అధికారి కూడా ఉండాలని బిల్లులో ప్రతిపాదించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పులను హైకోర్టులో సవాలు చేసే అవకాశం కూడా ఇచ్చారు. కొత్త చట్టంగా అమలులోకి వచ్చాక 6 నెలల లోపు దేశంలోని ప్రతి వక్ఫ్ ఆస్తినీ సెంట్రల్ పోర్టల్ లో విధిగా నమోదు చేయించాలి. ఇక వక్ఫ్ ఆస్తుల విషయంలో జిల్లా కలెక్టర్లకు కూడా అధికారాన్నిస్తోంది కొత్త బిల్లు.కొత్త బిల్లు వల్ల వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ పెత్తనం పెరిగిపోతుందని, ఆ ఆస్తుల్ని క్రమక్రమంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవి వట్టి అపోహలేనంటున్నారు కేంద్ర మంత్రులు. బిల్లుని సమగ్రంగా పరిశీలించాలంటున్నారు. ఇప్పటి వరకు వక్ఫ్ ఆస్తులు ముస్లింలలో కొంతమంది పెద్దవారి చేతుల్లో ఉన్నాయని, వాటిని పేదవారి దగ్గరకు తెచ్చేందుకే ఈ బిల్లు అని అంటున్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా వక్ఫ్ ఆస్తుల్ని అన్యాక్రాంతం చేసి వారి సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని, అలాంటి పనులకు ఇప్పుడు చెక్ పెట్టినట్టవుతుందని కేంద్రం వాదిస్తోంది.వక్ఫ్ బోర్డ్ ఆధీనంలో ఉన్న భూములను సరిగా వినియోగించుకుంటే వాటిపై ప్రతి ఏటా 1.2 లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందనేది సచార్ కమిటీ నివేదిక చెబుతోంది. కానీ ప్రస్తుతం కేవలం ఏడాదికి 200 కోట్ల రూపాయలు మాత్రమే ఆదాయం వస్తోందట. తాజా సవరణ వల్ల ముస్లిం సమాజానికి భారీ నష్టం తప్పదని విశ్లేషకులు అంటున్నారు. అందుకే, ప్రతిపక్షలు తమ వాదనను బలంగా వినిపిస్తున్నాయి.

# ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.వెయ్యి కోట్లు

## మరో నెల గడువు పెంచిన ప్రభుత్వం



హైదరాబాద్ : లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ గడువు ముగిసింది. ఎల్ఆర్ఎస్ ఆదాయం, అప్లికేషన్లపై అధికారులు ప్రకటన చేశారు. ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని ప్రకటించారు. 6.87 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ప్రాసెస్ చేశామని తెలిపారు.అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అమలు చేస్తుంది. మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారి 25 శాతం రాయితీ కూడా కల్పించింది. ఎల్ఆర్ఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను అధికారులు ప్రకటించారు. కాగా మరో నెల రోజుల పాటు ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించారు

ఎల్ఆర్ఎస్ వివరాలు

మున్సిపాలిటీలలో మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు- 15.27 లక్షలు

రిజెక్ట్ అయిన దరఖాస్తులు- 15,894

ప్రాసెస్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు- 6.87 లక్షలు

ఎల్ఆర్ఎస్ ఫీజు పెండింగ్ ఉన్న దరఖాస్తులు- 8.65 లక్షలు

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు- 2.6 లక్షలు

ప్రొసీడింగ్స్ ఇచ్చిన దరఖాస్తులు- 58,032

రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినా ఆశించినంత మేర రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి ప్రభుత్వం అనుకున్న మేర స్పందన కూడా రాలేదు. దీనిలో భాగంగానే.. మరో సారి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించింది.ఇప్పటి వరకు 4 లక్షల మంది దరఖాస్తుదారులు రూ.1200 కోట్ల వరకు ఫీజు చెల్లించారు. పథకం అమలు తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు కూడా ఎదురయ్యాయి. దీనిని అధికారులు పరష్కరించేలోపే గడువు తేదీ సమీపించింది. దీంతో వరుసగా ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో చివరి రెండు రోజులు కార్యకలాపాలు సాగలేదు. ఈ నేపథ్యంలో గడువు పొడిగించాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తడంతో.. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఓటీఎస్‌ను మరో నెల రోజులు పొడిగించింది.2024-25 ఆర్థిక సంవత్సరం చివరి రోజున అంటే మార్చి 31న 43,700 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజు చెల్లించారు. ఆ ఒక్క రోజే ఫీజు కింద దాదాపు రూ.124 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారాలు తెలిపారు. అయితే ఈ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నేడు నిర్ణయం తీసుకోగా.. ఏప్రిల్ 1వ తేదీన కూడా ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని వర్తింపజేశారు.ఇదిలా ఉంటే లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) గడువు మార్చి 31తో ముగిసింది. దీంతో వన్ టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈసారి గడువు పెంచినప్పటికీ ఫీజులో రాయితీ 25 శాతం కాకుండా తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎల్ఆర్ఎస్ స్కీమ్ 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. గత ఉత్తర్వుల ఆధారంగా దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించేందుకు ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.ఈ పథకం అమలులో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. అధికారులు వీటిని పరిష్కరించే లోపు గడువు సమయం ముగిసింది. దీంతో గడువు పొడిగించాలని వినతులు వస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లోనూ పలువురు ఎమ్మెల్యేలు ఎల్ఆర్ఎస్ ఓటీఎస్ గడువును ఏప్రిల్ చివరి వరకూ పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో రెవెన్యూ రాకపోవటంతో గడువు మరోసారి పొడగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొన్ని పరిమితులతో గడువు మరోసారి పొడిగించారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నమోదుకు అవకాశం

హైదరాబాద్ : త్వరలో స్థానిక సంస్థల ఎన్నిక లకు నగారా మోగనుంది. ఎన్నికల సంఘం ఓటరు నమోదును నిరంతర ప్రక్రియగా చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి కటాఫ్ తేదీని ఖరారు చేసి తుది ఓటరు జాబితాను ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ఎప్రిల్ 1 నుంచి 18 ఏళ్ళు నిండిన వారికి ఓటుగా నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు.గతంలో ఓటర్ల నమోదుకు జనవరి1 తేదీ మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. సదరు తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా అర్హత లభించేది. సదరు విధానానికి స్వస్తి పలికారు. జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను సైతం ప్రామాణికంగా తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. జాబితాలో లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తిస్థాయిలో సవరించాలని అధికారులను ఎన్నికల సంఘం ఆదేశించింది.ఏప్రిల్ లో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి యంత్రాంగం సిద్ధమై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు స్వీకరించడమే కాకుండా నమోదుకు సంబంధించిన నిబంధనలు వివరించారు. ఈ క్రమంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త ఓటర్లను నమోదు చేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా గ్రామం, వార్డు, డివిజన్ స్థాయిలో ఉండే ఆయా పార్టీల నాయకులు తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఓట్ల నమోదుపై దృష్టి సారిస్తున్నారు.అరచేతిలోనే ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ముందుగా అధికారిక వెబ్ సైట్లోకి వెళ్లాలి. సర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి.

అందులో మొబైల్ నంబర్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్లైన్లో కొత్త ఓటుకు రిజిస్ట్రేషన్ చేసు కోవడం, తప్పులను సరిచేసుకోవడానికి, ఓటు హక్కును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేసుకోవడానికి, జాబితాలో రెండు ఓట్లు ఉంటే ఒకదాన్ని తొలగింపు, ఇతర అంశాలకు సంబంధించి వేర్వేరుగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 కనిపిస్తాయి. వాటిలో మీకు కావాల్సిన దానిపై క్లిక్ చేసి అందులో పొందుపర్చాల్సిన వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు ఏఈఆర్వోకు వద్దకు వెళ్తాయి. పరిశీలించి ఆమోదిస్తారు.వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద ఉన్న మొబైల్లో ఫ్రబిబిజూబ: లనీబివతీబ. వఞతి. ణనీల. తిని యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా లేదా చూసుకునే అవకాశం కల్పించారు.ఓటరు గుర్తింపు కార్డు కావాలనుకునేవారు వెబ్ సైట్ లోకి వెళ్లాలి. అందులో ఈ-ఎపిక్ కార్డు డౌన్లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మొబైల్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపు కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం అయితే ఓటీపీ వస్తుంది. లేకుంటే కాదు. ఫారం-8 ద్వారా ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తర్వాత గుర్తింపు కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఏయే ఫారం.. ఎందుకంటే...

ఫారం-6: కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు ఈ దరఖాస్తును పూరించాలి. ఒక ఫొటో, వయసు నిర్ధారణ పత్రం(ఎస్సెస్సీ మెమో), చిరునామా ధ్రువీకరణ ఉండే కరెంట్ బిల్లు, నల్లా బిల్లు, ఇంటి పన్ను వంటి వాటిని జతచేయాలి.

ఫారం-6ఏ: విదేశాల్లో ఉన్న వారి కోసం ప్రత్యేకంగా ఫార్మాట్ రూపొందించారు. ఎన్నారైలకు రాష్ట్ర ఎన్నికల సంఘం 2018 నుంచి ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ఫారం-7: ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఈ ఫారంను పూరించాలి. ఓటరు మరణించినా, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డా వారిని జాబితా నుంచి తొలగించాలని ఈ పారం ద్వారా ఫిర్యాదు చేయెుచ్చు.

ఫారం-8ఏ: పట్టణాల్లో చాలామంది ఒక కాలనీ నుంచి మరో కాలనీకి మారుతుంటారు. ఈ క్రమంలో ఓటు వేసేటప్పుడు ఇబ్బందులు పడుతుంటారు. వారి కోసం ఈ ఫారం ఉప యోగపడుతుంది. ఒక పోలింగ్ బూత్ నుంచి మరో సమీప పోలింగ్ బూత్ కు మారేందుకు దరఖాస్తు చేయాలి.ఇక ఓటరు నమోదు, ఎన్నికలకు సంబంధించి 1950 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఫిర్యాదు కూడా చేయెుచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందిస్తారు. అంతేకాకుండా ఇంటర్ నెట్ నుంచి ఈమెయిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం 5,30337 మంది పురుషులు, 5.52.358 మంది మహిళలు, 61 ట్రాన్స్ జెండర్స్ మొత్తం 10,82,751 ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు జాబితాలో మహిళలే ఎక్కువగా నమోదయ్యారు. ఈసారి సైతం వారి సంఖ్య పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. యువత.. ఓటు నమోదుకు ముందుకు రావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# పొలాల గెట్లు తొలగించొద్దు..

- అలా చేస్తే రైతుల మధ్య ఏర్పడే ఘర్షణకు ఎవరు బాధ్యులు?
- బీఆర్ఎస్ సభకు భూములు ఏ విధంగా ఇస్తారో అలానే తిరిగివ్వాలి
- ఆ మేరకు లిఖితపూర్వక హామీ ఇవ్వాలి: రైతు నేత శ్రీకాంత్



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండల కేంద్ర శివారు ఎల్కతుర్తి-సిద్దిపేట నేషనల్ హైవేకు ఆనుకొని ఉండే చింతలపల్లి గ్రామ ప్రజల భూముల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు కొనసాగుతుండగా, ఆ ల్యాండ్స్‌లో గెట్లు( పొలాల మధ్య వరాలు) తొలగించొద్దని యువరైతు, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు హింగే శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన రిలీజ్ చేశారు. సభ నిర్వహణకు ఎలాంటి అభ్యంతరం తెలపబోమని చింతలపల్లి గ్రామ రైతుల నుంచి సంతకాలు సేకరిస్తున్న క్రమంలో వారి పొలం గెట్లు ఉంచుతారా? తొలగిస్తారా? అనే అనుమానం రైతులలో మొదలైందని తెలిపారు. సభ నిర్వహించుకోవడంలో ఎలాంటి అభ్యంతరం లేదని కానీ, సభ నిర్వహణ పేరుతో రైతుల పొలాల వరాలు (ఒడ్లు) తొలగిస్తే సభ నిర్వహణ అనంతరం రైతుల మధ్య ఘర్షణలు తలెత్తుతాయని, ఆయా ఘర్షణలకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. పొలాల గెట్లు తొలగిస్తే సభ నిర్వహణకు భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. సభ సందర్భంలో జనం ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు సాగుభూమిలో పడవేస్తే.. వాటిని ఎవరు తొలగిస్తారని అడిగారు. రైతులు ఏ విధంగా అయితే సభకు భూములను అప్పగిస్తున్నారో.. అదేవిధంగా చేసి ఇస్తామని హామీ ఇస్తేనే సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు రైతులకు లిఖితపూర్వకంగా స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. లేనియెడల సభ నిర్వహణ కోసం భూములు ఇవ్వబోమని స్పష్టం చేశారు.

# ఘనంగా మాంటిస్సోరి హైస్కూల్ వార్షికోత్సవం

**వేద న్యూస్, సుర్యాపేట ప్రతినిధి:**




జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని జీవీవీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ రణబోతు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించే వరకు విశ్రమించవద్దని అన్నారు. ఆ పాఠశాలలో చదివి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా డాక్టర్ భూమిరెడ్డి, డాక్టర్ నారాయణరావు, మారం లింగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి ధనేశ్వరరావు,మోటివేటర్ పూర్ణ శశికాంత్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుజాత రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా పోస్టర్ విడుదల చేసిన మంత్రి సురేఖ

**వేద న్యూస్, వరంగల్ :**



తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రిగా తాను ప్రత్యేక చొరవ తీసుకొని ఏప్రిల్ 11న వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు టాస్క్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళా పోస్టరును స్థానిక కలెక్టర్ సత్య శారదా... వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితర నాయకులతో మంత్రి కొండా సురేఖ శనివారం రిలీజు చేశారు. జిల్లాలో నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సురేఖ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టరును విడుదల చేస్తూ మంత్రి మీడియాతో మాట్లాడారు. వరంగల్ జిల్లా యువతీ యువకులందరూ మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొని, తమ పేరును నమోదు చేసుకొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరారు.

నిర్వాహకులు విడుదల చేసిన పోస్టర్ లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులు ఎన్ రోల్ చేసుకోని ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఏప్రిల్ 11వ తేదీన ఉదయం 9:30 గంటల నుండి ప్రారంభం అవుతుందని మంత్రి గుర్తు చేశారు.

# ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**వేద న్యూస్, సుర్యాపేట ప్రతినిధి :**



మహిళలు ఆర్థిక ప్రగతి సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యమని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గండూరి కృపాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి చార్టర్ ప్రెసిడెంట్ ఇరిగి కోటేశ్వరి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో మణి డెంటల్ హాస్పిటల్ పక్కన గల శ్రీ భగవాన్ ఆయుర్వేదిక్ బిల్డింగ్ నందు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోసి, మగ్గం వర్క్ ఉచిత శిక్షణ తరగతులను వారు ప్రారంభించి మాట్లాడారు.మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదిగేందుకు ఈ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.మహిళలు స్వయం ఉపాధి పొందేలా మూడు నెలల పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ముందుండాలని అన్నారు. అనంతరం టైలరింగ్ లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి సూర్యాపేట ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆప్ స్ఫూర్తి అధ్యక్షురాలు బి.శ్రీదేవి, మాజీ అధ్యక్షురాలు తన్నీరు ప్రమీల,మాజీ జడ్పీ కేతిరెడ్డి పద్మ, లయన్స్ మెంబర్ పగిళ్ల రేణుక, ట్రైనర్స్ గుండపునేని లక్ష్మి, శ్రీరామదాసు రేణుక,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కొమిరెడ్డి రెండవది వర్థంతి

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొమిరెడ్డి రాములు రెండవ వర్థంతి సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు శనివారం మెట్పల్లి లోని కొమిరెడ్డి నివాస ప్రాంగణంలో పార్టీ నాయకులు కార్యకర్తల మధ్య ఆయన తనయులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ లతో కలిసి రాములు చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల హనుమాన్ల యాదవ్ మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కీర్తి గౌరవాన్ని దశ దిశల చాటిన స్వర్గీయ శ్రీ కొమిరెడ్డి రాములు.. ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, విద్యార్థి దశ నుండే ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించారని అన్నారు. ఒక బీసీ బిడ్డగా బడుగు బలహీన వర్గాల నుండి ఈ ప్రాంతంలో బలమైన నాయకుడిగా ఎదిగారన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా చట్టసభల గురించి సంపూర్ణ అవగాహన ఉన్న ఆయన, ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాంతాల నుండి తనను ఆశ్రయించిన ఎంతోమందికి న్యాయం చేశారని. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అన్ని రంగాలలో వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన శాసనసభ్యులు కొనసాగిన కాలంలో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చే ఎన్నో పథకాలు అమలుపరిచి లబ్ధి చేకూర్చేలా కృషి చేశారన్నారు.



## సబ్ కలెక్టర్‌కు ఘన సత్కారం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూ నిర్వాసితుల్లో అర్హులైన 112 మందికి ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం టీజీ జెన్ కో వారు హైదరాబాదులో అందజేయడం జరిగింది. గతంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ వారందరికీ ఉద్యోగాలు త్వరగా రావాలని యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితుల్లో అర్హులైన (112) జాబితాను టీజీ జెన్కో వారికి ప్రభుత్వానికి పంపడం జరిగింది. ఈ విషయమై,ఉద్యోగ పత్రాలు అందుకున్న వారందరు కృతజ్ఞత పూర్వకంగా మిర్యాలగూడ సబ్-కలెక్టర్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు వచ్చినందుకు గాను శనివారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ని వారి కార్యాలయంలో కలిసి సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ చలవ వల్లనే తమకి అందరికీ ఉద్యోగాలు వచ్చాయని వారు ఆనందం వ్యక్త పరచడం జరిగింది.



## ఆకుల మానసకి సన్మానం

**వేదన్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

మెట్‌పల్లి బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకుల మానస ను రామ్ నగర్ కాలనీ వాసులు శనివారం మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానం చేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆకుల మానస మాట్లాడుతూ తాను ఏకగ్రీవ ఎన్నిక కావడం సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలకు న్యాయపరంగా అన్నిరకాల సలహాలు, సహకారాలు ఎప్పుడు అందిస్తానని అన్నారు. బొడ్ల జల, సామాన్ల సుమ, సాంగు మంజుల, కోరుకంటి రోజా, మార్గం లావణ్య, చిట్యాల లలిత, సంతోషి ని, సామాన్ల వనిత, తడుక స్వరూప, మొరపు శాలిని, లక్ష్మి ఉన్నారు.



## బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళి

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

మెట్ పల్లి పట్టణంలో మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో కుల రహిత సమాజం కోసం పాటుపడిన బడుగు, బలహీన వర్గాల నేత మాజీ ఉప ప్రధాని సమతావాది డాక్టర్ పూజ్య బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి పురస్కరించుకొని శనివారం జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. మేనేజర్ వెంకటలక్ష్మి, డి ఈ నాగేశ్వరరావు, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, హరితాహారం ఇంచార్జ్ విజయ్, వార్డ్ ఆఫీసర్స్ నిఖిల్, రచన, రమ్య, సిస్టమ్ మేనేజర్ శ్రీకాంత్, ఎన్విరాల్మెంట్ ఇంజనీర్ విష్ణు ఇంచార్జి సానిటరీ జవాన్‌లు ముజీబ్, నిజాం, మున్సిపల్ సిబ్బంది నవీన్,రాజశేఖర్,జల పాల్గొన్నారు.

## తిమ్మాపురంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



తిమ్మాపురం రామాలయ టెంపుల్ ఆవరణలో మాజీ భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలవేసి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ ఉద్యమకారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోని బలహీన వర్గాల అభివృద్ధికి సామాజిక అభివృద్ధికి అలాగే ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని బాబు జగ్జీవన్ రామ్ కృషి చేశారని అన్నారు.

## సివిల్ ఇంజనీర్ మోటంఆనంద్ కు సన్మానం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం లోని జంగాల కాలనీకి చెందిన మోటం ఆనంద్ తండ్రి నారాయణ నిరుపేద కుటుంబానికి చెందిన వారు. అలాంటి పెద కుటుంబంకి చెందిన ఆనంద్‌కు మిర్యాలగూడ పట్టణంలోని అవంతిపురం మిషన్ భగీరథ ప్లాంట్‌లో సివిల్ ఇంజనీర్‌గా ప్రభుత్వ ఉద్యోగం లభించింది. ఈ సందర్భంగా బేడ బుడగ జంగాల హక్కుల రిజర్వేషన్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడమంచి నరసింహ ఆధ్వర్యంలో ఆనంద్‌కు శాలువాతో శనివారం ఘన సన్మానం చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన ఆనంద్ సివిల్ ఇంజనీర్ గా ఉద్యోగాన్ని పొందడం ఎంతో గర్వకారణం అని,మా తరపున ప్రత్యేక అభినందనలు తెలుపుతూ ఉన్నామని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి బాల్యదశ నుంచే కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రిపాలెం జంగాల కాలనీఅధ్యక్షుడు కొండపల్లిఏసు,మోటం నాగయ్య,మోటం వెంకన్న,విభూది శ్రీను,ఆలేటి రామలింగం,దుదురుకు శివ,మోతే గోవర్ధన్,కప్పరి సురేష్,కేతావత్ రాయికల్,తదితరులు పాల్గొన్నారు.

# మహానేతకు ఘన నివాళులు

**వేదన్యూస్,దామరచర్ల :**





భారత మాజీ ఉప ప్రధాని డా.బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా దామరచర్ల మండల కేంద్రంలో ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూల మాల లు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కారపాటి గాంధీ,సందాల శంభయ్య మాదిగ మాట్లాడుతూ మన మాజీ ఉప ప్రధాని డా.బాబు జగ్జీవన్ రామ్ అతి చిన్న వయసులో కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఏకైక వ్యక్తి మాత్రమే కాదు. 35 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎక్కువ కాలం మంత్రి పదవి చేసిన ఏకైక నాయకుడు కూడా వారే అని అన్నారు. ఆనాటి స్వతంత్ర ఉద్యమం నుంచి వారు నిత్యం బడుగు బలహీన వర్గాల తరుపున పోరాడుతూ ఎంతో మందికి స్ఫూర్తిని ఇచ్చారు. అలాగే దాదాపు 45 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి తమ సేవలు అందించి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు అయ్యారు అని అన్నారు. అలాంటి మహనీయుని జయంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించడం వారిని స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సందాల బాబు,రాపోల్ కొట్టయ్య,సందాల శ్రీధర్,కోటరాజేష్.సందాల లక్ష్మణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

### సంస్కరణ యోధుడు జగ్జీవన్‌రామ్

**వేద న్యూస్, కరీంనగర్:** కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవానికి నాంది పలికిన గొప్ప సంస్కరణ యోధుడిగా పేరుగాంచిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ కొనియాడారు. శనివారం ఆయన తన ఆఫీసులో జగ్జీవన్ రామ్ 118వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, మొట్టమొదటి భారత దేశ ఉప ప్రధానిగా దేశానికి ఎన్నో సేవలు జగ్జీవన్ రామ్ చేశారని పేర్కొన్నారు. ఉప ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశంలో అనేక సంస్కరణలకు నాంది పలికి గొప్ప దేశభక్తులుగా పేరుగాంచిన నేత అని, దళిత జాతి ఆణిముత్యమని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోడేటి అనిల్, గొట్టి హర్షవర్ధన్ ,అరవింద్, హరికృష్ణ ,మహేష్ ,ప్రకాష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**



రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి ఉన్నత విద్యను అభ్యసించారని, క్యాపిటల్ వన్ బ్యాంకు లో ఆసియా కు సీఇవొ గా పనిచేశారని, సూర్యాపేట నియోజకవర్గం ప్రజలకు సేవలను అందించడానికి రాజకీయాల్లో కి వచ్చారని డిసిసి అధ్యక్షులు, రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి జన్మదిన వేడుకలను మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెవిటి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబం నాలుగు తరాల నుండి కాంగ్రెస్ పార్టీ కుటుంబం అని, రాంరెడ్డి దామోదర్ రెడ్డి తండ్రి, అన్నయ్యలు కాంగ్రెస్ పార్టీ లో పనిచేశారని, నేడు ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి కూడ కాంగ్రెస్ పార్టీ లో కొనసాగుతున్నారని అన్నారు. ఎటువంటి పదవులు లేనప్పటికీ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ లోనే వున్నారని అన్నారు. సూర్యాపేట, తుంగతుర్తి రెండు నియోజకవర్గాలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి కి రెండు కళ్ల లాంటివని అన్నారు. బిసి సామాజిక వర్గానికి చెందిన తనకు తిరుమలగిరి మార్కెట్ చైర్మన్ గా తనకు రెండు సార్లు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అవకాశం ఇచ్చారని, రెండు సార్లు సూర్యాపేట డిసిసి అధ్యక్షుడిగా పనిచేసే అవకాశం కల్పించారని, రాంరెడ్డి దామోదర్ రెడ్డి సామాజిక న్యాయం పాటించే నాయకుడని అన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి సర్వోత్తమ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. సూర్యాపేట పట్టణంలో పలు వార్డులలో సర్వోత్తమ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ ఆలి, పెద్దగట్టు చైర్మన్ పోలబోయిన నర్సయ్య యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీరన్న నాయక్, చింతమల్ల రమేష్, వేములకొండ పద్మ, కుంభం రాజేందర్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, నాగుల వాసు, గడ్డం వెంకన్న, అన్నమయ్య రాము, రుద్రంగి రవి, ఆలేటి మాణిక్యం, రావుల రాంబాబు, గండూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు కుటుంబ ప్రేమానురాగాలు అందించాలి

- **జయ స్కూల్‌లో ఘనంగా కిండర్ గార్టెన్ కన్వకేషన్ ప్రోగ్రామ్**

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**



తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయం పిల్లలతో గడపాలని, వారితో ఆప్యాయంగా మాట్లాడాలని, పిల్లలు ప్రతి విషయం తల్లిదండ్రులకు చెప్పే స్వేచ్ఛను పిల్లలకు కల్పిస్తే తల్లిదండ్రులతో పిల్లలకు విడదీయరాని అనుబంధం ఏర్పడుతుందని జయ స్కూల్ కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అన్నారు. శనివారం సాయంత్రం జయ స్కూల్ నెహ్రూ నగర్ కిండర్ గార్టెన్ కన్వకేషన్ ప్రోగ్రామ్ స్కూల్ విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయ స్కూల్ డైరెక్టర్‌లు జెల్లా పద్మ, బింగి జ్యోతిలు మాట్లాడుతూ విద్యార్థులు వైఫల్యం చెందినప్పుడు కుంగిపోవద్దని, కిందపడిన ప్రతిసారి పైకిలేచి విజయం సాధిండానికి ప్రయత్నం చేయాలని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, వ్యక్తి నిర్మాణం జయ స్కూల్ నందు నేర్పిస్తామని అన్నారు. మన ఇతిహాసాలు, పురాణాలు విద్యార్థులు చిన్నతనంలో నేర్చుకోవడం వలన వారు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు తాతయ్య, అమ్మమ్మ ఇంటికి తీసుకుని వెళ్లి వారితో కలిసి మాట్లాడడం నేర్పిస్తే కుటుంబ సంబంధాలు, ప్రేమానురాగాలు వెల్లివిరిస్తాయని అన్నారు. విద్యార్థులలో దాగి వున్న ప్రతిభను గుర్తించాలని వారికి పెయింటింగ్, మ్యూజిక్ వంటి ఆర్ట్ నేర్పించాలని అన్నారు. జయ స్కూల్ గత 13 సంవత్సరాల నుండి అనేకమంది విద్యార్థులను డాక్టర్‌లుగా ఇంజనీర్లుగా తీర్చిదిద్దిందని, అటువంటి వారిని మీ పిల్లలకు రోల్ మోడల్‌గా చూపిస్తే వారు స్ఫూర్తిని పొంది చదువులో రాణిస్తారని అన్నారు. 175 మంది విద్యార్థులతో నెహ్రూ నగర్‌లో 2012 లో ప్రారంభం అయిన జయ స్కూల్ తెలంగాణ రాష్ట్రములో అనేక అద్భుతమైన విజయాలను సాధించిందని అన్నారు. సూర్యాపేట జిల్లాతో పాటు నల్గొండ జిల్లాలో జయ స్కూల్ ను విస్తరిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ లను డైరెక్టర్ లు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు జాతీయ సమైక్యతను, మన పండుగలు, గ్రామ దేవతలను తెలియజేసే విధంగా చేసిన నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా పులి రాజేష్ ముదిరాజ్

**వేద న్యూస్, హనుమకొండ :**



ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మెపా రాష్ట్ర నాయకుడు పులి ప్రభాకర్ ముదిరాజ్ అధ్యక్షతన హనుమకొండలో నిర్వహించిన ఈ సమావేశంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ వివిధ సామాజిక కార్యక్రమాలతో మెపా రాష్ట్రవ్యాప్తంగా దూసుకెళుతుందని పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. కాగా హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా పులి రాజేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ సుందర్, గౌరవ అధ్యక్షులు పులి సదానందం, ఉపాధ్యక్షులుగా సిద్ద సుమన్, గోనెలా విజేందర్, మట్టెపల్లి సాంబయ్య, కార్యదర్శిలుగా వాసు శ్రీను, రోకుల సందీప్, కేశబోయిన కోటేశ్వరరావు, కోశాధికారిగా మట్టేపల్లి రణధీర్, కార్యవర్గ సభ్యులుగా కట్ల విజయ్, ఉడుతబోయిన క్రాంతికుమార్ ముదిరాజ్ లని ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ బాధ్యులకు పులి దేవేందర్ ముదిరాజ్,రాష్ట్ర కమిటీ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

## సామాజిక సమానత్వం కోసం పోరాడిన దార్శనికుడు జగ్జీవన్ రామ్

**వేద న్యూస్, హన్మకొండ :**

బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా పుల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో పెద్దమ్మ గడ్డ సెంటర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కాంగ్రేస్ రాష్ట్ర నాయకులు బోడ డిన్న హాజరయ్యారు. సామాజిక సమానత్వం కోసం,వెనుకబడిన వర్గాల కోసం పోరాడిన దార్శనికుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. దళితులు, అణచివేతకు గురైన వర్గాల వారికి అండగా ఉంటూ వారి హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అన్నారు, స్వాతంత్ర్య సమర యోధుడిగా, రాజకీయ నాయకుడిగా, ఉప ప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం కొనియాడారు. కిష్టి వేణు, ప్రదీప్, మనోహర్, దశరధం, జయరాం, ప్రవీణ్, రాజశేఖర్, రాజేష్, రజిన్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీఎంసీ.. స్లో యాక్షన్..?

**మొదటి పేజీ తరువాయి**

అర్హత లేకుండా వైద్యం అందిస్తే మెడికల్ కౌన్సిల్ కొరడా ఝళిపించాలి. రోగికి సరైన వైద్యం అందించకపోవడం, తప్పుడు చికిత్స అందించడం, అవసరమైన పరీక్షలు, వైద్య పద్ధతులు పాటించకుండా అనవసరమైన తప్పిదాలు చేయడం, శస్త్రచికిత్సల్లో ఘోరమైన తప్పిదాలు, సరైన అర్హతలు లేకుండా వైద్యం చేయడం, నకిలీ డిగ్రీలు పొందిన వైద్యులు, అనుమతి లేని లేదా నిషేధిత మందులు వాడటం వంటి ఫిర్యాదుల్లో నిత్యం బాధితులు మెడికల్ కౌన్సిల్ ఆఫీసులో వినతులు ఇస్తున్నారు. అధికారులు కంప్లయింట్స్ స్వీకరిస్తున్నారు. కానీ చర్యలు చేపట్టడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. ఫిర్యాదు అనంతరం సదరు కేసు విషయమై సంబంధిత వైద్యుడికి సంబంధించిన ప్రైవేటు లేదా ప్రభుత్వ ఆస్పత్రుల వారితో మాట్లాడి.. సెటిల్‌మెంట్ చేసుకుంటూ.. దానిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని కొందరు బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలా చేస్తే కౌన్సిల్ ఉన్నా.. లేనట్టేనని అభిప్రాయపడుతున్నారు. కౌన్సిల్ సామాన్యుడికి, బాధితుడికి న్యాయం చేసేదిలా కాకుండా కొందరికి సంపాదనకు మార్గంగా మారుతోందనే ఆరోపణలు వినబడుతున్నాయి.

### నెలలు గడుస్తున్నా నో యాక్షన్..

వరంగల్ నగరానికి చెందిన 30 ఏండ్ల కృష్ణ.. 2024 జూలైలో అపెండెసిస్ సమస్యతో బాధపడుతూ..వరంగల్‌లోని బంధన్ ప్రైవేటు దవాఖానలో చేరాడు. అక్కడ శస్త్ర చికిత్స చేయించుకోగా..అది వికటించింది. వెంటనే హైదరాబాద్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి అధిక మొత్తంలో ఖర్చు చేసుకొని చికిత్స పొందాడు. అప్పటికే మొదటి శస్త్ర చికిత్స సరిగ్గా చేయకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. తనకు జరిగిన చికిత్సపై అనుమానంతో ఆపరేషన్ థియేటర్‌లో తీసిన వీడియో కావాలని ఆస్పత్రిని సంప్రదించగా సిబ్బంది స్పందించలేదు. తనకు న్యాయం చేయాలని, సదరు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని 10 డిసెంబర్ 2024లో మెడికల్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేశాడు. నెలలు గడస్తున్నా.. ఇప్పటి వరకు ఆ కేసు పురోగతిలో లేకపోవడం గమనార్హం. తమకు న్యాయం చేస్తారేమోననే ఆశతో బాధితులు కౌన్సిల్‌కు వస్తే.. చర్యలకు కౌన్సిల్ పూనుకోకపోవడంపైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బాధితుడు కృష్ణ ఆరోపిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, W arangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, W arangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073